క్లుప్తంగా

నేటి నుంచి శివాలయంలో యంత్రమూర్తి ప్రతిష్ఠాపన

నెన్నెల: మండల కేంద్రంలోని గంగాధర దేవాలయ (శివాలయం) పునఃనిర్మాణం చేపట్టిన సందర్భంగా ఈ నెల 18నుంచి 20వ తేదీ వరకు గంగాధర శివపంచాయతన నవగ్రహ శిఖర, యంత్రమూర్తి స్థిర ప్రతిష్ఠాపన మహోత్సవంతో పాటు హనుమాన్, శివాలయాల్లో ధ్వజస్తంబాల శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ ఆలయ కమిటీ అధ్యక్షుడు చిలువేరు సుదర్శన్, ఉపాధ్యక్షుడు దొంతుల రాజన్న, హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు నూతి స్వామి తెలిపారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమం, పూజాభిషేకం, నవగ్రహ ఆలయ ధ్వజశిఖర యంత్రమూర్తి స్థిరప్రతిష్ఠాపన మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవ కార్యక్రమంలో శ్రుంగేరి గంగా పీఠాధిపతి పురుషోత్తమ భారతి మహాస్వామి పాల్గొని మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారన్నారు. మూడు రోజుల పాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థుల నృత్యాలు అదుర్స్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక పద్మనాయక ఫంక్షన్ హాల్లో ది హ్యాపీ స్కాలర్ షిప్ స్కూల్ 22వ వార్షికోత్సవ సంబురాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శాస్త్రీయ నృత్యాలు, నాటికలు, మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలతో విద్యార్థులు అదరగొట్టారు. కార్యక్రమంలో ఎంఈవో పోచయ్య, కరస్పాండెంట్ విక్రమ్ రావు, ట్రస్మా నాయకులు విష్ణవర్ధన్‌రావు, శరత్‌కుమార్, ఉస్మాన్ పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ కార్యవర్గం

లక్సెట్టిపేట: బీజేపీ పట్టణ నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథరావు ఆదివారం స్థానిక ఐబీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ప్రకటించారు. పట్టణాధ్యక్షుడిగా వీరమల్ల హరిగోపాల్, ప్రధాన కార్యదర్శిగా సామ వెంకటరమణ, సతీష్, సాయి సచిన్, ఉపాధ్యక్షులు చాతరాజు శివశంకర్, వెంబడి వెంకటేష్, సమరసింహ, రమేష్, కొమాకుల రవి, శ్రీనివాస్, మోర్చా కమిటీ బీసీ సభ్యులు పాంచాల రమేష్, ఎస్సీ సభ్యులు మామిడాల శంకర్, ఎస్టీ సభ్యులు ప్రవీణ్, మహిళా అధ్యక్షురాలు కళావతి, బీజేవైఎం అధ్యక్షులు బుద్దె సిద్దార్థలను నియమించినట్లు తెలిపారు.

విద్యార్థి మృతిపై విచారణ చేపట్టాలి

మంచిర్యాలఅర్బన్: స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థి వహీదా మృతిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని అధికారులను డిమాండ్ చేశారు.

ముగిసిన ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్



గెలుపొందిన జట్టుతో నిర్వాహకులు

కాసిపేట: మండల కేంద్రంలోని ముత్యంపల్లి మైదానంలో నిర్వహించిన కాసిపేట మండల ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. గత నెల 16న ప్రారంభమైన టోర్నమెంట్‌లో పది ఫ్రాంచైజీలు పాల్గొనగా, లీగ్ పద్ధతిలో నిర్వహించిన టోర్నమెంట్‌లో మొదటి స్థానం సాధించిన జట్టుకు కప్‌తో పాటు రూ.50వేలు, ద్వితీయస్థానం సాధించిన జట్టుకు రూ.30వేలు కప్‌ను క్రీడాకారులకు ప్రోత్సాహ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దాతలు అప్పల చంద్రశేఖర్, చంద్రమౌళి, మోటూరి సాయి, నిర్వాహకులు బోయిని తిరుపతి, రాజు, గారె శంకర్, కంటం తిరుపతితో నాయకులు సిద్ధం తిరుపతి, రాపర్తి శ్రీనివాస్, నస్పూర్ నర్సింగ్, రాంచందర్, శేఖర్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముస్తాబు

బెల్లంపల్లి: ఏఎంసీ ఏరియాలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎట్టకేలకు ముస్తాబైంది. వాస్తు దోషాలు లేకుండా క్యాంపు కార్యాలయంలో తగిన మార్పులు చేశారు. త్వరలోనే సుముహూర్తం చూసుకుని ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక పూజలు చేసి గృహ ప్రవేశం చేయనున్నారు.

పల్లె దవాఖానాలకు సుస్తీ..!

- సిబ్బంది ఉన్నా.. సౌకర్యాలు శూన్యం
- పక్కాభవనాలు లేక అద్దె ఇళ్లలో కొనసాగుతున్న వైనం
- అరకొర వసతులతో ఇబ్బంది పడుతున్న రోగులు
- నిధులున్నా భవనాలు నిర్మించడంలో జాప్యం



విలేజ్ నస్పూర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న పల్లెదవాఖానా

నస్పూర్: పట్టణ పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రాలు, పల్లె (బస్తీ) దవాఖానాలు మౌలిక వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. అద్దె ఇళ్లలో కొనసాగుతున్నాయి. దీంతో పల్లె దవాఖానాలకు వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీరాంపూర్ కాలనీ, కృష్ణాకాలనీ, ఆర్‌అండ్‌ఆర్ తాళ్లపల్లి ఫ్లాట్‌లలో మాత్రం శాశ్వత భవనాలు ఉండగా, మిగిలిన ఎనిమిది పల్లె దవాఖానాలు కనీస మౌలిక వసతులు లేని అద్దె ఇళ్లలో కొనసాగుతున్నాయి. వివిధ సమస్యలతో రోగులు వస్తుండగా వారు కూర్చోవడానికి కనీసం ఫర్నీచర్, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని సబ్ సెంటర్లు వర్షాకాలం వచ్చిందంటే ఉరుస్తున్నాయి. వర్షపు నీటితో సబ్ సెంటర్‌లోని మందులు, రికార్డులు, ఇతర సామగ్రి తడిసిపోతోంది.

11పల్లె దవాఖానాలలో సేవలు...

పట్టణ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విలేజ్ నస్పూర్, సీసీసీ, సుందరయ్య కాలనీ, తాళ్లపల్లి, కృష్ణాకాలనీ, అరుణక్కనగర్, శ్రీరాంపూర్, సంఘంమల్లయ్యపల్లి, సీతారాంపల్లి, ఆర్‌కే 6, నస్పూర్ కాలనీలలో మొత్తం 11పల్లె దవాఖానాలు ఉన్నాయి. వీటిలో ఇద్దరు ఎంబీబీఎస్, ముగ్గురు ఆయుర్వేదిక్ డాక్టర్లు, ఒక్కరు బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు ఉండగా, 17మంది ఏఎన్‌ఎంలు, 52మంది ఆశ వర్కర్లు సేవలు అందిస్తున్నారు. పేద ప్రజలకు వైద్యసేవలందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా పలు వైద్య, ఆయుష్ పోస్టులను మంజూరు చేసి వాటిని భర్తీ చేసింది.

నిధులున్నా.. స్థలాలు లేక

పట్టణ పరిధిలోని పల్లెదవాఖానాలకు శాశ్వత భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం ఒక్కో పల్లె దవాఖానాకు సుమారు రూ.20లక్షల చొప్పున కేటాయించింది. ఎనిమిది పల్లె దవాఖానాల భవన నిర్మాణాలకు నిధులు కేటాయించగా, ప్రభుత్వం స్థలం కేటాయించలేకపోవడంతో భవన నిర్మాణాలు చేపట్టడం లేదు. పట్టణంలో అనేక ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఉన్నాయి. అదే విధంగా అనుకూలమైన సింగరేణి స్థలాలు సైతం అందుబాటులో ఉన్నాయి. భవన నిర్మాణాలకు ప్రభుత్వం ఇటు సింగరేణి, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని స్థలాలు కేటాయించేలా చొరవ తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. అదే విధంగా శాశ్వత భవనాలు నిర్మించే వరకు నిరుపయోగంగా ఉన్న సింగరేణి కార్యాలయాలను తాత్కాలికంగా పల్లె దవాఖానాలు నిర్వహణకు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

స్థలాల కోసం ప్రయత్నిస్తున్నాం

పల్లె దవాఖానాలకు శాశ్వత భవన నిర్మాణాలకు నిధులున్నాయి. నిర్మాణాలకు అవసరమైన స్థల సేకరణకు ఉన్నతాధికారుల ద్వారా సింగరేణి, రెవెన్యూ అధికారులను సంప్రదిస్తున్నాం. స్థల సేకరణ పూర్తయిన వెంటనే భవన నిర్మాణాలకు చర్యలు చేపడుతాం.

\- సుబ్బారాయుడు, జిల్లా వైద్యాధికారి

40ఏళ్లుగా అద్దె భవనంలోనే..

- పక్కా భవనానికి నోచుకోని బీసీ హాస్టల్



అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ హాస్టల్

దండేపల్లి: అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలన్నీ విద్యా రంగానికి పెద్దపీట వేస్తామని గొప్పలు చెప్పినప్పటికీ, దండేపల్లిలో మాత్రం బీసీ హాస్టల్ భవనానికి ఏళ్లు గడుస్తున్నా పక్కా భవనం మాత్రం నిర్మించడం లేదు. సుమారు 40ఏళ్ల క్రితం దండేపల్లిలో బీసీ హాస్టల్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అద్దె భవనంలోనే కొనసాగుతుంది తప్పా.. పక్కా భవనం ఏర్పాటు చేయలేదు. హాస్టల్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటికీ మూడు ఇళ్లు మార్చారు. అద్దె ఇళ్లలో అరకొర వసతుల నడుమ హాస్టల్ నిర్వహించడంతో, క్రమక్రమంగా హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. కనీసం ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ హాస్టల్ పక్కా భవనానికి నిధులు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

జనక్‌ప్రసాద్‌కు సన్మానం



సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వ మినిమం వేజెస్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌ను ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. రసూల్‌పల్లెలోని ఆయన నివాసంలో కలిసి పూలమాలతో సత్కరించారు. నూతనంగా చేపట్టిన ప్రభుత్వ పదవికి వన్నె తేవాలన్నారు. ఈ సందర్భంగా జనక్‌ప్రసాద్ మాట్లాడుతూ.. తనకు ఈ చైర్మన్ పదవి కట్టబెట్టినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. తమ యూనియన్ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి సహకారంతో యూనియన్‌కు సేవలందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు, జాతీయ సమితి సభ్యులు సీహెచ్ భీంరావు, కేంద్ర ఉపాధ్యక్షులు కలవేన శ్యాం, నాయకులు జైపాల్ రెడ్డి, ల్యాగల శ్రీనివాస్, కొలిపాక సమ్మయ్య, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌ను రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల సలహా మండలి చైర్మన్‌గా నియమించినందుకు మందమర్రి ఏరియా ఐఎన్‌టీయూసీ నాయకులు ఆదివారం రసూల్‌పల్లిలోని జనక్‌ప్రసాద్ నివాసంలో బొకే అందించి శాలువా కప్పి సన్మానించారు. ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, నాయకులు రాజమౌళి, నరేందర్, తిరుపతి, చంద్రశేఖర్, వేణు, రాజేంద్రప్రసాద్, చక్రపాణి, కమల్, కన్నయ్య ఉన్నారు.

మహిళలు గౌరవంగా నడుచుకోవాలి



భాగ్యలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న సభ్యులు

మందమర్రిరూరల్: ప్రతీ మహిళా కుటుంబంలో అమ్మగా, తోబుట్టువులా అనేక పాత్రల్లో గౌరవంగా నడుచుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. పట్టణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం, లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల సఖీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో సేవలందించిన మహిళలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం సంఘం సభ్యులు భాగ్యలక్ష్మి దంపతులను మెమొంటో అందించి శాలువా కప్పి సన్మానించారు. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు ఉన్నారు.

పుణ్య స్నానాలకు ముదిరాజ్‌లు



భీమారం నుంచి గోదావరి పుణ్యస్నానాలకు పాదయాత్రగా వెళ్తున్న ముదిరాజ్‌లు

భీమారం: మండల కేంద్రం నుంచి చెన్నూర్ గోదావరి నదికి ఆదివారం ముదిరాజ్‌లు గ్రామదేవతలతో పాటు పాదయాత్రగా వెళ్లి పుణ్యస్నానాలు చేశారు. సోమవారం లక్ష్మీదేవి ఆలయంలో నిర్వహించే బోనాలను పురస్కరించుకొని ముదిరాజ్‌లు ఉపావాస్య దీక్షలు చేపట్టారు. ఈ మేరకు గ్రామదేవతలను తీసికెళ్లినట్లు తెలిపారు. బోనాల పండుగకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరుకావాలని వారు కోరారు.

చెక్‌పోస్టు వద్ద సీఐ తనిఖీలు



వాహనం తనిఖీ చేస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

కాసిపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి సమీపంలోని టోల్‌గేట్ వద్ద పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆదివారం రాత్రి మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిటీ నిబంధనల మేరకు రూ.50వేలకు మించి నగదు తరలించరాదని తెలిపారు. సీఐ వెంట కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్, డెప్యూటీ తహసీల్దార్ మాణిక్‌రావు తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



జన్నారం: సాయం అందజేస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని దుబ్బగూడెంకు చెందిన రత్నం రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సేకరించిన నగదు రూ.10వేలతో పాటు 25కిలోల బియ్యం బాధిత కుటుంబానికి సంఘం అధ్యక్షుడు దుర్గయ్యతో పాటు సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఉన్నారు.

అనారోగ్యం భారిన పడిన గల్ఫ్ కార్మికునికి బాసట

జన్నారం: ఉపాధి కోసం ఖత్తర్ దేశం వెళ్లి, అనారోగ్యం భారిన పడిన గల్ఫ్ కార్మికుడికి తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి నాయకులు బాసటగా నిలిచారు. జన్నారం మండలం జన్నారం గ్రామానికి చెందిన ఖాదర్ ఉపాధి కోసం గత కొన్ని సంవత్సరాల క్రితం ఖత్తర్ దేశం వెళ్లి అనారోగ్యం భారిన పడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పని చేస్తుండేవాడు. అనారోగ్యం భారిన పడిన విషయం తెలుసుకున్న గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర ఇంచార్జి ఎరుకల రాజగౌడ్ ఆధ్వర్యంలో వైద్య చికిత్స అందించి, స్వగ్రామానికి పంపారు. విషయాన్ని గల్ఫ్ కార్మికులు సోషల్ మీడియా గ్రూపులలో పెట్టగా కార్మికులు స్పందించి పోగు చేసిన రూ.15,000 ఆదివారం ఖాదర్‌కు అందజేసినట్లు నాయకులు సాదిక్‌బాబ, రమేశ్‌గౌడ్, సింహరాజు, శేఖర్, కిరణ్, చంద్రమౌళి, అంజన్న, సురేశ్, దుమల్ల ఎల్లయ్య తెలిపారు. ప్రభుత్వ పరంగా గల్ఫ్ కార్మికున్ని, ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



సీఓఈ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో, పక్కన ప్రిన్సిపాల్

మందమర్రిరూరల్/జన్నారం/దండేపల్లి/నెన్నెల/బెల్లంపల్లి: పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9–30గంటల నుంచి మధ్యాహ్నం 12–30గంటల వరకు పరీక్ష జరుగుతుంది. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పరీక్ష కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించామని, పరీక్షలు సజావుగా జరగడానికి పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్‌ను పోలీసులు అమలు చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. బెల్లంపలిలోని సంక్షేమ బాలుర గురుకులల సీఓఈ పరీక్ష కేంద్రాన్ని, నెన్నెలలో పరీక్ష కేంద్రాలను మండల విద్యాశాఖ అధికారి మహేశ్వర్ రెడ్డి సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జన్నారంలో మండల విద్యాధికారి విజయ్‌కుమార్, మందమర్రిలో పరీక్ష కేంద్రాలను ఎంఈవో జాడి పోచయ్య పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. మౌలిక వసతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

ఫ్లెక్సీలు తొలగింపు



ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది

భీమారం: మండల కేంద్రంలోని వివిధ పార్టీలు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను ఆదివారం ఉదయం పంచాయతీ సిబ్బంది తొలగించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ రావడంతో అధికారులు గోడరాతలు, ఫ్లెక్సీలు తొలగించే పనులు చేపడుతున్నారు.

విగ్రహాలకు ముసుగు



నస్పూర్: సార్వత్రిక ఎన్నికల కోడ్ శనివారం నుంచి అమలులోకి రావడంతో పట్టణ పరిధిలోని పలు రాజకీయ నాయకుల విగ్రహాలకు మున్సిపల్ సిబ్బంది ముసుగు వేశారు. సీసీసీ కార్నర్‌లోని మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, శ్రీరాంపూర్‌కాలనీ బస్టాండ్ వద్ద గల మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ విగ్రహాలకు ఆదివారం మున్సిపల్ సిబ్బంది ముసుగులు తొడిగారు.

అంతర్గత రోడ్లకు మహర్దశ

- ఆరు మండలాలకు రూ.5.42కోట్లు
- తీరనున్న అవస్థలు
- ఎమ్మెల్యే చొరవతో నిధులు మంజూరు



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్ (ఫైల్)

కోటపల్లి: గ్రామాల్లోని అంతర్గత రహదారులకు మహర్దశ పట్టనుంది. సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అంతర్గత వీధులు అస్తవ్యస్తంగా ఉండి అవస్థలు పడుతున్న పల్లెవాసులకు సీసీ రోడ్లు నిర్మిస్తుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెన్నూర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రభుత్వం ఉపాధి హామీ నుంచి రూ.5.42 కోట్ల నిధులు మంజూరు చేసింది. వీటిని సీసీ రోడ్లు, డ్రైయినేజీలు నిర్మాణానికి వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు అనేక గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణం జరిగినా..మరికొన్ని ప్రాంతాల్లో మట్టి రోడ్డే కనిపిస్తున్నాయి. కొన్నేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న కొద్దిపాటి నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు వేస్తున్నప్పటికి పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయకపోతుండటంతో కొద్దికొద్దిగా నిర్మించేది అంతర్గత వీధులు చిన్నగా ఉండటం అవి మట్టిరోడ్లు కావడంతో ప్రజలు చాలా రకాలుగా అవస్థలు ఎదుర్కొనేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితులు దాదాపు దూరమవుతున్నాయి.

ప్రతిపాదనలు ఇలా..

నియోజకవర్గంలోని చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్, మందమర్రి, మండలాల్లో 110 పంచాయతీలు ఉన్నాయి. దాదాపు అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు వేసేందుకు ఉపాధి హామీ నిధులు వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించి నిధులు మంజూరు చేసింది. వీటికి సంబంధించి అధికారులు గ్రామాల్లో సర్వే నిర్వహించి పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు అవసరమని గుర్తించారు. ఇందుకోసం మండలాల వారీగా భీమారంలో రూ.97లక్షలు, చెన్నూర్‌లో రూ.కోటి 4లక్షలు, జైపూర్‌లో రూ.కోటి 33లక్షలు, కోటపల్లికి రూ.కోటి 47లక్షలు, మందమర్రి రూ.60.80 లక్షలు మొత్తం రూ.5కోట్ల42 లక్షలు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వారం పాటు ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత

గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు మెరుగుపర్చేందుకు ప్రాధాన్యత కల్పిస్తున్నాం. ఇప్పటికి చాలావీధుల్లో మట్టిరోడ్డే దర్శనమిస్తున్నాయి. దశలవారీగా అంతర్గత వీధుల్లో మట్టిరోడ్లను సీసీగా మార్చి ప్రజల ఇబ్బందులు తొలగిస్తాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాం. అన్ని గ్రామాల్లో త్వరలో సీసీ రోడ్లు పూర్తవుతాయి.

\- గడ్డం వివేక్, చెన్నూర్ ఎమ్మెల్యే

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?



భీమారం బస్టాండ్ ప్రాంతంలో ప్రమాదాలు జరిగే ప్రదేశం

భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై భీమారం బస్టాండ్ వద్ద అతివేగంగా వచ్చే వాహనాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. జాతీయరహదారి గుండా మహారాష్ట్ర వైపు రాకపోకలు ప్రారంభమైన అనంతరం వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. అయితే భీమారం బస్టాండ్ వద్ద వాహనాల వేగం తగ్గించకపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్రవాహనాలు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయి. భారీ వాహనాలతో పాటు కార్లు, బొలేరో వాహనాలు పరిమితికి మించి వేగంగా వెళ్లడం ఆ సమయంలోనే బస్టాండ్ వద్ద ద్విచక్రవాహన చోదకులు రోడ్డు క్రాస్ చేసే సమయంలో ఢీ కొడుతున్నాయి. పాదాచారులు కూడా ప్రమాదాలకు లోనవుతున్నారు. వాహనాల వేగాన్ని తగ్గించేందుకు పోలీసులు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్పీడ్ బ్రేకర్లతో పాటు బారికేడ్లు ఏర్పాటు చేసినా వాహనాల వేగాన్ని తగ్గించే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

యథేచ్ఛగా మట్టి దందా



భీమిని: ప్రభుత్వ, ప్రైవేట్ స్థలంలో తవ్వకాలు చేపట్టాలన్న, మట్టి తరలించాలన్న ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి. కొందరు వ్యాపారులు ఇదేమి పట్టించుకోకుండా తవ్వకాలు చేపడుతూ మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లోని పలు గ్రామపంచాయతీల పరిధిలో రైతుల అవసరాల సాకుతో ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల నుంచి ఇష్టానుసారంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారు. ఇటీవల కన్నెపల్లి మండలంలోని సబ్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారనే సమాచారంతో రెవెన్యూ అధికారులు దాడులు చేసి జేసీబీ, రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. అక్రమంగా మట్టి దందా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అయినప్పటికీ మళ్లీ ఈ అక్రమ మట్టి దందా రాత్రి వేళల్లో జోరుగా సాగుతోంది. కట్టడి చేయాల్సిన అధికారులే 'మామూలు'గా తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మట్టి దందాను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కంకర పోశారు.. పనులు మరిచారు!



లింగాపూర్-అల్లీపూర్ మధ్య నిలిచిన పనులు

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ నుంచి అల్లీపూర్ వరకు, దండేపల్లి నుంచి నర్సాపూర్, కన్నెపల్లిలో నిర్మించే బీటీ రోడ్ల నిర్మాణాలకు కాంట్రాక్టర్లు కంకర పోసి నెలలు గడుస్తున్నా పనులు మాత్రం పూర్తి కావడం లేదు. దీంతో ఈ రోడ్ల గుండా ప్రయాణించేందుకు ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.